క్లుప్తంగా

కొనుగోలు కేంద్రం తనిఖీ

గంగాధర: మండలంలోని మధురానగర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి ఆర్వీ కర్ణన్ బుధవారం తనిఖీ చేశారు. సన్నరకం ధాన్యం అమ్మకానికి తీసుకువస్తున్నారా అని కేంద్రం నిర్వాహకులను ఆరా తీయగా రైతులు దొడ్డు రకమే పండించారని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తున్నామని వివరించారు. వెంట కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో రాము తదితరులు ఉన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంటలో ఐకేపీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తనిఖీ చేశారు. రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

గంగాధర: గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఫార్చ్యూన్ మెడికేర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కరీంనగర్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొన్నేళ్లుగా చొప్పదండి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదలకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారని, మెడికేర్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో 140 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్టు వైద్యులు తెలిపారు. మాజీ సర్పంచ్ నజీర్, మెడికేర్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు తొలగింపుపై వాగ్వాదం

జమ్మికుంట: మున్సిపల్‌కు చెందిన భూమిలో షెడ్డు నిర్మిస్తున్నారని కాలనీకి చెందిన కొందరు ఫిర్యాదు చేశారు. బుధవారం మున్సిపల్ టీపీవో శ్రీధర్, టీపీఎస్ సిబ్బంది షెడ్డు తొలగించేందుకు యత్నించగా స్థానిక వార్డు కౌన్సిలర్ అధికారులతో గొడవకు దిగారు. కోరపల్లి రోడ్డులో శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం వరకు అక్రమ కట్టడాలను తొలగించాలని ఆరోపించారు. అధికారులు అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటామని, 28 వార్డులో అక్రమ షెడ్డును రెండు రోజుల్లో తొలగించాలని అధికారులు తెలపగా తాత్కాలికంగా అక్రమ నిర్మాణం కూల్చివేత నిలిచిపోయింది.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

తిమ్మాపూర్: మండలంలోని వచ్చునూరు గ్రామానికి మంజూరైన రూ.4 లక్షల డీఎంఎఫ్‌టీ నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోసం 2022లో డీఎంఎఫ్‌టీ నిధులతోపాటు ఆరెకరాల భూమి కేటాయించగా నిధులను పంచాయతీ అనుమతి లేకుండా పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ఖర్చు చేశారని, ఆరెకరాల్లో కొంత భూమిని ఆలయానికి కేటాయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉప్పులేటి కుమార్ కోరారు.

'అభివృద్ధిని ఓర్వలేకపోతున్నారు'

ఇల్లందకుంట: కాంగ్రెస్ పథకాలకు వస్తున్న ఆదరణ, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్‌ఎస్, బీజేపీ ఓర్వలేకపోతున్నాయని మాజీ ఎంపీటీసీ ఎక్కటి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కనుమల్ల రామకృష్ణ, పెద్ది కుమార్, ఉడత రత్నాకర్,బొమ్మ శ్రీనివాస్,బండి మల్లయ్య, రాజబాబు, లింగయ్య, రమేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

35 రోజుల పసికందు మృతి

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామంలో 35 రోజుల పసికందు అనుమానాస్పదంగా మృతి చెందింది. కుర్ర ఆంజనేయులు, అనూష దంపతులకు నెల రోజుల క్రితం పాప పుట్టింది. బుధవారం మధ్యాహ్నం అత్తాకోడలికి గొడవ జరిగింది. అనంతరం ఎవరి పనుల్లో వారు ఉండగా సాయంత్రం పాలు పట్టేందుకు తల్లి ప్రయత్నించగా పాప అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతి చెందింది. మృతిపై అనుమానాలున్నాయనే అనూష ఫిర్యాదుతో ఎల్‌ఎండీ ఎస్‌ఐ వివేక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వివరాలు తెలియాల్సి ఉంది. గొడవ అనంతరం ఏం జరిగిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజాపూర్‌లో ఒకరికి డెంగీ

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ లో ఒకరు డెంగీ బారిన పడినట్టు వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. చెన్నైలో ఉంటున్న యువకుడు ఇటీవల జ్వరంతో స్వగ్రామం రాజాపూర్ వచ్చాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించుకోగా డెంగీ పాజిటివ్ రిపోర్టు వచ్చిందన్నారు. వ్యక్తి ఇంటితో పాటు చుట్టు పక్కన 50 ఇళ్లల్లో మందులు పిచికారీ చేశామని వివరించారు.


గంగాధర చౌరస్తా సమీపంలో అసంపూర్తి కాలువ నిర్మాణం


ఎల్లమ్మ చెరువు సమీపంలో ..

ఏళ్లుగా సాగుతున్న పనులు

- అసంపూర్తిగా కుడికాలువ నిర్మాణం
- నిధులు మంజూరైనా ఫలితం లేదు
- ఉప కాలువల నిర్మాణాలకు వివిధ గ్రామాల్లో పూర్తికాని భూసేకరణ

గంగాధర: నారాయణపూర్ కుడి కాలువ నిర్మాణ పనులు ఏళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో నీరున్నా ఫలితం లేకుండా పోతోంది. వంతుల వారీగా సాగుతున్న పనుల్లో ప్రస్తుతం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి నుంచి రైల్వేలైన్ వరకు, గంగాధర చౌరస్తా, ఎల్లమ్మ చెరువు సమీపంలో పనులు చేయాల్సి ఉంది. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వేములవాడ వరకు గ్రావిటీ కాలువను నిర్మించడంతో పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని స్తంబంపల్లి, వేములవాడ చెరువులను నింపి ఉపకాలువల ద్వారా ఇతర చెరువు, కుంటలు నింపుతారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాలువ పనులు పూర్తి కావడం లేదు. ఎల్లంపల్లి నుంచి గంగాధర, నారాయణపూర్ జలాశయాలు నింపి ఇక్కడి నుంచి రెండు (కుడి, ఎడమ) ప్రధాన కాలువలు, వాటి కింది ఉపకాలువలతో చెరువు, కుంటలకు నీరందిస్తారు. ఎడమ కాలువ పనులు దాదాపు పూర్తికాగా నాలుగైదేళ్ల నుంచి రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు.


రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద... కుడికాలువ

నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వేములవాడ చెరువు వరకు 18 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మించి స్తంబంపల్లి, వేములవాడ చెరువులకు నీటిని తరలిస్తారు. ప్రధాన కాలువ నుండి 12 ఉప కాలువలు నిర్మిస్తారు. పనులు పూర్తయితే వేములవాడ, బోయినపల్లి మండలాలతో పాటు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలాల్లోని పలుగ్రామాలకు సాగు నీరందుతుంది. ప్రస్తుతం గంగాధర చౌరస్తా వరకు ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయింది. గంగాధర చౌరస్తా సమీపంలో భూసేకరణకు పలుమార్లు సర్వే నిర్వహించినా కొలిక్కి రాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. గంగాధర చౌరస్తా నుంచి బోయినిపల్లి ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణం పనులు పూర్తయ్యాయి. జగిత్యాల ప్రధాన రహదారితో పాటు గంగాధర సమీపంలోని రైల్వేలైన్, ఎల్లమ్మ చెరువు సమీపంలో కాలువ నిర్మాణం పనులు చేపట్టాల్సి ఉంది.

అసంపూర్తిగా ఉపకాలువలు

నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి వేములవాడ వరకు నిర్మించనున్న ప్రధాన కాలువ పనులు కొంతమేర పూర్తయ్యాయి. సంవత్సరాల క్రితం తవ్విన కాలువ చాలా చోట్ల కూలిపోతోంది. అసంపూర్తి పనులు పూర్తయ్యే వరకు గతంలో తవ్విన కాలువ మరోసారి తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉప కాలువల నిర్మాణాలకు వివిధ గ్రామాల్లో ఇప్పటి వరకు భూసేకరణ పూర్తి కాక పోవడంతో ఉప కాలువల నిర్మాణం సైతం పెండింగ్‌లో ఉన్నాయి.

రాజకీయ పార్టీల ఆందోళన

కుడికాలువతో పాటు ఉపకాలువ పనులు వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, గతంలో రాజకీయ పార్టీలు పలుమార్లు ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్ర చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా త్వరగా పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులు సహకరిస్తేనే పనులు

చిగురుమామిడి: గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కాల్వల కింద భూములు కోల్పోతున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో రాతపూర్వకంగా అభ్యంతరాలు తెలిపితే తగిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్ గ్రామాల్లో బుధవారం భూనిర్వాసితులతో గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బొమ్మనపల్లిలో 33, ఉల్లంపల్లిలో 17, కొండాపూర్‌లో 18 మంది రైతులు భూములను కోల్పోతున్నారని తెలిపారు. రైతులు సహకరిస్తే త్వరలోనే కాల్వల తవ్వకం పనులు మొదలు పెడతామన్నారు. నిర్వాసితులు మాట్లాడుతూ... ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం అందించాలని, లేనిపక్షంలో భూములు ఇవ్వబోమని తెలిపారు. వేర్వేరుగా జరిగిన గ్రామసభల్లో ఇరిగేషన్ ఈఈ రాములు, డీఈఈ ప్రశాంత్, ఏఈలు రాకేశ్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్లు రజని, శ్రీనివాస్‌రెడ్డి, ప్రత్యేకాధికారి సువిశాల, రికార్డు అసిస్టెంట్ స్వప్న, కార్యదర్శులు నాగరాజు, సంపత్ గ్రామస్తులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో మహేశ్వర్

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకావొద్దు


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు, ఉపాధ్యాయులు

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసకావొద్దని ఎక్సైజ్ సీఐ టీ.శ్రీనివాసు అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి బోర్నపల్లిలోని బీసీ సంక్షేమ గురుకుల, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్‌అనర్థాలపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు బానిసైతే జీవితం అంధకారమవుతుందన్నారు. జీవితాలు బాగుండాలంటే విద్యకు మించిన ఆయుధం లేదన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ వినోద్‌కుమార్, హెచ్‌ఎం ఎం. సంపత్, బి.రాజిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది ముకుంద రెడ్డి, నవీన్, చిరంజీవి, శృతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తిమ్మాపూర్: మండలంలోని నేదునూరు గ్రామానికి చెందిన పంపు ఆపరేటర్ ఎలగందుల భూమయ్య కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు బుధవారం భూమయ్యను పరామర్శించారు. అనంతరం రూ. ఐదువేలు అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వెంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రెడ్డిగాని రాజు, జిల్లా కార్యదర్శి మామిడి అనిల్‌కుమార్, లక్ష్మణ్‌రావు, మొగిలి, నీలం జగన్‌రెడ్డి, అనిల్, కుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


నగదు అందిస్తున్న తుమ్మనపల్లి శ్రీనివాసరావు

వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్: మండలంలో వెన్కెపల్లికి చెందిన వేముల మధునయ్య(68) బుధవారం చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాలు.. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి మధునయ్య వృద్ధాప్యం, అనారోగ్యం, భార్య మృతితో మానసిక వేదనకు గురై ఇంటి వెనుక ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడని ఎస్‌ఐ వివరించారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

శంకరపట్నం: కన్నాపూర్ పంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ చేశారు. పంచాయతీ సిబ్బంది బుధవారం తెల్లవారుజామున చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను స్టార్ట్ చేయగా బ్యాటరీ కనిపించకపోవడంతో కార్యదర్శి కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామంలో బుధవారం రాత్రి బైక్ పైనుంచి పడటంతో తల్లీ, కొడుక్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కేశవపట్నంకు చెందిన సూత్రాల లక్ష్మి, కొడుకు సంపత్‌తో కలిసి హుజూరాబాద్ నుంచి స్వగ్రామం వస్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. గాయపడినవారిని 108 హుజూ రాబాద్ ఆస్పత్రికి తరలించామన్నారు.

ముగ్గురికి జరిమానా

శంకరపట్నం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురిని హుజూరాబాద్ కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున న్యాయమూర్తి ఈశ్వరయ్య జరిమానా విధించారని ఎస్సై రవి తెలిపారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

చొప్పదండి: సమగ్ర సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ కోరారు. కమిషనర్ నాగరాజుతో కలిసి బుధవారం ఇంటింటికీ సర్వే స్టిక్కర్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హుజూరాబాద్‌రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు సర్వేను విస్తృతం చేశారు. పట్టణం, మండల వ్యాప్తంగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ పవన్‌కుమార్ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు తీసుకోగా ఎన్యూమరేటర్లు ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో కమిషనర్ ఎండీ ఆయాజ్ సర్వేను ప్రారంభించారు.

మానకొండూర్: మండలంలో సర్వే ప్రారంభమైంది. మూడు రోజుల పాటు ఎన్యుమనేటర్స్ ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్ వేశారు. మానకొండూర్‌లో డీఆర్‌డీవో శ్రీధర్ కార్యక్రమాన్నీ పర్యవేక్షించారు.

సైదాపూర్: మండలంలోని అమ్మనగుర్తిలో ఎన్యూమరేటర్లు సర్వే చేపట్టారు. మొదటగా ఇళ్లకు సర్వే స్టిక్కర్లు అతికించారు.

శంకరపట్నం: మండలంలో సర్వే ప్రారంభమైందని ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని ధర్మారం ,కన్నాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ స్టిక్కర్స్ వేసే ప్రక్రియను ఎంపీవో ప్రభాకర్‌తో కలిసి పరిశీలించారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 కబడ్డీ పోటీలకు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి టి.తరుణ్‌కుమార్ ఎంపికయ్యాడు. 8వ తేదీ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొనే జట్టుకు ఎంపికయ్యాడని ఫిజికల్ డైరెక్టర్ కొమురోజు కృష్ణ తెలిపారు. 2న హుజూరాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికవ్వడం పట్ల జెడ్పీహెచ్‌ఎస్ బాలుర హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు..


హాసినిని అభినందిస్తున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు తరుపున మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ప్రగతి హైస్కూల్ విద్యార్థిని వేముండ్ల హాసిని ప్రతిభ కనబరిచింది. పోటీల్లో రజత పతకం సాధించింది. విద్యార్థిని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు బుధవారం అభినందించారు. కార్యక్రమంలో బాసరవేణి లక్ష్మణ్, కరస్పాండెంట్ రాధాకృష్ణ టీచర్లు పాల్గొన్నారు.

హాకీ జట్టు కోచ్‌గా విక్రమ్

హుజూరాబాద్‌రూరల్: సంగారెడ్డి జిల్లాలో అండర్-17 రాష్ట్ర స్థాయి హాకీ క్రీడాపోటీల్లో పాల్గొన్న కరీంనగర్ జిల్లా హాకీ జట్టుకు కోచ్‌గా రుక్మాపూర్ సైనిక్ స్కూల్ పీఈటీ, పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన మోటపోతుల విక్రమ్ ఎంపికైనట్లు పట్టణ హాకీ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. పోటీలు ఈ నెల 7 వరకు జరగనున్నాయని తెలిపారు.

ఓటరు నమోదుపై సమావేశం

శంకరపట్నం: ఓటరు నమోదుపై ఆయా రాజకీయపార్టీల నాయకులతో తహసీల్దార్ భాస్కర్ బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెల 9, 10న పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు 6, 7, 8 ఫారమ్‌లు తీసుకుంటారని పేర్కొన్నారు. సమావేశంలో మహిపాల్, ఆరీఫ్, శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

సరస్వతి ఆలయానికి గోదానం



చొప్పదండి: పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయానికి మండలంలోని ఆర్నకొండకు చెందిన పిల్లలమర్రి విజయలక్ష్మి బుచ్చయ్య, అనూష రామన్న దంపతులు బుధవారం గోదానం చేశారు. ఆలయ అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి, భాష్యం నవ్య కుమార్ సమక్షంలో గోవును అందించారు. కార్యక్రమంలో గుర్రం మల్లారెడ్డి, మేఘన, అక్షయ్‌కుమార్, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఉదయం 10 గంటలకు చేపట్టనున్నామని ఆలయ ఈవో మారుతి ప్రకటనలో తెలిపారు.



జమ్మికుంట: పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. రాత్రివేళ వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు గుంతలు పూడ్చివేత చర్యలు చేపట్టాలని ప్రమాదాలు జరగకుండా చూ దాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
బాపురెడ్డి, ఆర్అండ్‌బీ అధికారి, హుజూరాబాద్, సెల్ నంబర్ 94408 18421

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

చేపపిల్లల పంపిణీలో వాగ్వాదం

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యంగా చేపపిల్లల పంపిణీ చేస్తోందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపల్ పరిధి గుండ్ల చెరువులో చేపపిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, తహసీల్దార్ రమేశ్, కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుండ్ల చెరువులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్షకుపైగా చేపపిల్లలు విడుదల చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 54 వేలు మాత్రమే విడుదల చేసిందని గంగపుత్ర, ముదిరాజ్ బిడ్డలు గమనించాలన్నారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఎమ్మెల్యే ప్రసంగాన్ని దేశిని కోటి, పొనగంటి మల్లయ్య అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీలను చేయలేదని, పార్టీ కార్యక్రమం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని నినాదాలు చేశారు. దీంతో రెండు పార్టీల నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయగా టౌన్ సీఐ వరంగంటి రవి సర్ది చెప్పారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పీసీసీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందనే విషయాన్ని కౌశిక్‌రెడ్డి మరిచిపోయి మాట్లాడుతున్నారని ఆరోపించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాణి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఓదెలు, లత

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి, లలితాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెటు కమిటీ చైర్మన్, దేవంపల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి లత బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు టేకుమల్ల ఆంజనేయులు, సహదేవ్, పాక్స్ డైరెక్టర్లు ఎల్లయ్య, కొంరయ్య, సంఘ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి ు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో డీసీఎంస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రాణి బుధవారం ప్రారంభించారు. దళారులను నమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి ముప్పిడి సూర్యనారాయణ,పిఎసిఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, ఆర్ఐ నాగరాజ, అశోక్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు**

హుజూరాబాద్‌రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవచేయాలని విద్యావేత్త, చమక్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, వరంగల్ వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ ఆజమ్ తెలిపారు. రంగాపూర్‌లో హిల్ టాప్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిల్ టాప్ సంస్థ డైరెక్టర్ సునీల్ మాట్లాడుతూ.. నిజాయితీ, పట్టుదలతో చేసే పని ఫలితం ఇస్తుందని, అవరోధాలు ఎదురైనా విజయం కోసం ప్రయత్నం చేయాలన్నారు.

- **ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి**

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో ఎస్సారెస్పీ ప్రధాన కాలువను ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని యువజన కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావణ్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేశ్‌బాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

- **ప్రణాళికతో విద్యనభ్యసించాలి**

సైదాపూర్: విద్యార్థులు ప్రణాళికాతో విద్యనభ్యసిస్తూ పరీక్షల్లో మెరుగైన ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని వరంగల్ ప్రాంతీయ పాఠశాల విద్యా సంచాలకుడు సత్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని వెన్నెంపల్లి, ఆకునూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు.

- **మంత్రి 'పొన్నం' ఔదార్యం**

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ఆటోను వెనకనుంచి బైక్ ఢీకొట్టింది. ఆటో వెనుక కూర్చున్న మహిళలతో పాటు బైక్ నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తన కాన్వాయ్‌లోని ఓవాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

- **నుస్తులాపూర్ ఏఈగా రజిత**

తిమ్మాపూర్: టీఎస్ఎన్‌పీడీసీఎల్ నుస్తులాపూర్ ఏఈగా చిగురుమామిడికి చెందిన చిలుపూరి రజిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా రజిత వీణవంక నుంచి నుస్తులాపూర్ సబ్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

- **పరామర్శ**

చిగురుమామిడి: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ చిగురుమామిడి ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు తండ్రి ఎల్లయ్య(మాజీ సర్పంచ్) అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మృతదేహం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.